

7న పోస్టల్ కార్యకలాపాలు నిలిపివేత

విజయనగరం రింగురోడ్డు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విజయనగరం పోస్టల్ డివిజన్‌లోని అన్న పోస్టల్ ఆఫీస్‌ల్లో ఐటీ-2.0 రోల్ అవుట్ కారణంగా ఈ నెల 7న సోమవారం అన్ని పోస్టల్ కార్యకలాపాలు నిలిచిపోతాయని పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. తిరిగి 8న మంగళవారం యథావిధిగా పనిచేస్తాయని పేర్కొన్నారు. కొత్త సాఫ్ట్‌వేర్ పునరుద్ధరణ ప్రక్రియలో భాగంగా ఆ రోజు కార్యకలాపాలు ఆగుతాయని, వినియోగదారులంతా సహకరించాలని కోరారు.



మడ్డువలస రిజర్వాయర్

- అభివృద్ధికి దూరంగా మడ్డువలస రిజర్వాయర్
- పటిష్టంగా లేని గేట్లు, కాలువల గట్లు
- నిరాశలో రైతులు
- రేపు నీరు విడుదలకు అధికారుల సన్నాహాలు

శివారు ఆయకట్టుకు నీరందేనా?

మడ్డువలస జలాశయానికి పూర్వవైభవం వస్తుందా? 30వేల ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుందా? గేట్లు బాగు చేస్తారా? నిర్వహణ గాడిన పడుతుందా? జలాశయం వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తారా? ఈ ప్రశ్నలకు రైతుల నుంచి సందేహంతో కూడిన సమాధానం వస్తోంది. కొన్ని సంవత్సరాలుగా ప్రాజెక్టును పట్టించుకోకపోవడంతో అన్నదాతలు నమ్మకం కోల్పోయారు. నేతలు, అధికారుల హామీలను గాలి మాటలుగా పేర్కొంటున్నారు.



లీకేజీ ద్వారా వృథాగా పోతున్న నీరు

వంగర, జూలై 5 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పేరొందిన మడ్డువలస జలాశయంలో సాగునీరు పుష్కలంగా ఉన్నా శివారు పంట భూములకు అందించడంలో అధికారులు విఫలమయ్యారు. జలాశయం కనీస స్థాయిలో నిర్వహణకు నోచుకోవడం లేదు. గేట్లు దెబ్బతిని నీరు నిత్యం వృథాగా నాగావళిలో కలిసిపోతోంది. ఎడమకాలువ ఎనిమిది సంవత్సరాలుగా పటిష్టంగా లేదు. దీనివల్ల నీటి లీకేజీలతో పక్కనున్న పంట పొలాలు తంపర భూములుగా మారుతున్నాయి. వాటిలో ఏ పంట వేసినా దిగుబడి (మిగతా 8వ పేజీలో..)



దయనీయంగా నారాయణపురం ఆనకట్ట

షట్టర్లు బిగిస్తారా?

- అగమ్యగోచరంగా నారాయణపురం ప్రాజెక్టు
- సంవత్సరాలుగా పట్టించుకోని వైనం
- శిథిలమై ఊడిన షట్టర్లు
- నిల్వ ఉండని నీరు
- నిరాశలో ఆయకట్టు రైతులు

రాజాం/సంతకవిటి, జూలై 5 (ఆంధ్రజ్యోతి)

రెండు జిల్లాల పరిధిలోని సాగు భూములను సస్యశ్యామలం చేయాల్సిన ప్రాజెక్టు అది. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో మరింత గాడి తప్పింది. ఆధునికీకరణ పనుల (మిగతా 8వ పేజీలో..)



కార్యాలయ ప్రాంగణంలో వదిలేసిన కొత్త షట్టర్లు

సచివాలయ ఉద్యోగుల నిరీక్షణ





- నాలుగు రోజులైనా అందని బదిలీ ఉత్తర్వులు
- కొన్ని శాఖలకు ఇప్పటికీ తెలియని స్థాన చలనాలు
- ఎక్కడకు పంపించేస్తారోనని వారంతా ఆందోళన
- ఆనందంలో సర్వేయర్‌లు, గ్రామ రెవెన్యూ అధికారులు
- వీరికి హేతుబద్ధీకరణలో మినహాయించే ఆలోచన

శృంగవరపుకోట, జూలై 5 (ఆంధ్రజ్యోతి):

వేపాడ మండల పరిధిలోని ఓ గ్రామ సచివాలయంలో పని చేస్తున్న ఓ శాఖకు చెందిన ఉద్యోగికి ఐదు సంవత్సరాల సర్వీస్ పూర్తయింది. జూన్ నెలాఖరున ప్రభుత్వం చేపట్టిన బదిలీ కౌన్సెలింగ్‌కు హాజరై అందరితో పాటు ప్రజాప్రతినిధి సిఫార్స్ లేఖను జత చేశాడు. ఇవేమి పట్టించుకోని కౌన్సెలింగ్ అధికారులు ఓ మూడు స్థానాలతో ఆప్షన్స్ సూచించారు. కానీ ఏ స్థానం కేటాయించారో సమాచారం ఇవ్వలేదు. బదిలీ ఉత్తర్వు కోసం టెన్షన్‌తో ఎదురుచూస్తున్నాడు. ఈయనొక్కరే కాదు గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న సగం శాఖలకు చెందిన ఉద్యోగుల పరిస్థితి ఇది.

బదిలీలకు కౌన్సెలింగ్ జరిగి నాలుగు రోజులు గడుస్తోంది. ఇంతవరకు వారినెక్కడకు బదిలీ చేశారో చెప్పకపోవడంతో వారంతా మానసిక వేదనకు గురవుతున్నారు. జిల్లాలో జూన్ 28 నుంచి జూన్ 30 వరకు గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు ఆయా శాఖాధిపతులు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. హెల్త్ సెక్రటరీ (గ్రేడ్-3 ఏఎన్‌ఎం), మహిళ పోలీస్, రెవెన్యూ శాఖకు చెందిన గ్రామ రెవెన్యూ అధికారులకు ఎక్కడెక్కడ స్థానాలు కేటాయించారో తెలిసాయి. మిగిలిన శాఖల్లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఐదు స్థానాల వరకు అప్షన్‌లు అడిగారు. అప్పటి నుంచి తమకెక్కడకు బదిలీ చేశారో తెలియక ఈ శాఖల ఉద్యోగులంతా సతమతమవుతున్నారు. వీరి పరిస్థితి ఇలా వుంటే రెవెన్యూ శాఖకు చెందిన గ్రామ, రెవెన్యూ అధికారులు, సర్వే శాఖకు చెందిన సర్వేయర్‌లను గ్రామ, వార్డు సచివాలయాల హేతుబద్ధీకరణ నుంచి మినహాయింపు ఇచ్చే (మిగతా 8వ పేజీలో..)



పెంపుడు జంతువులతో జాగ్రత్త

- పొంచి ఉన్న వ్యాధుల ముప్పు
- నేడు జూనోసిస్ డే

7

పారాది వద్ద ట్రాఫిక్ జామ్

బొబ్బిలి రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): పారాది గ్రామ సమీపంలో లారీ బోల్తా పడి భారీగా ట్రాఫిక్ ఆగిపోయింది. శనివారం ఉదయం బొబ్బిలి నుంచి రామబద్రపురం వైపు వెళ్తున్న లారీ అదుపు తప్పి రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. గ్రామస్థులు, స్థానికులు గమనించి ప్రమాదంలో చిక్కుకున్న డ్రైవర్, క్లీనర్‌లను సురక్షితంగా బయటకు తీశారు. బొబ్బిలి పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. శుక్రవారం కూడా ఈ ప్రదేశంలోనే రెండు లారీలు బోల్తా పడ్డాయి.





పారాది సమీపంలో బోల్తా పడిన లారీని పక్కకు తీస్తున్న ఎక్స్‌కవేటర్, ఇన్‌సెట్‌లో భారీగా నిలిచిపోయిన వాహనాలు



బాధితులకు చెక్కు అందజేస్తున్న జిల్లా న్యాయాధికారి బబిత

1664 కేసులు పరిష్కారం

- జిల్లా న్యాయాధికారి బబిత
- విజయవంతంగా జాతీయ లోక్‌అదాలత్

విజయనగరం క్రైమ్, జూలై 5(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్ పురస్కరించుకుని చేపట్టిన కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలో శనివారం 1664 కేసులు పరిష్కారమయ్యాయని జిల్లా న్యాయాధికారి బబిత తెలిపారు. విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, శృంగవరపుకోట, చీపురుపల్లి, గజపతినగరం, కొత్తవలస, కురుపాం న్యాయస్థానాల ద్వారా ఇన్ని కేసులకు పరిష్కారం లభించిందన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీయే రాజమార్గమని, కేసులను సామరస్యపూర్వకంగా స్నేహపూరిత వాతారణంలో పరిష్కరించుకోగలిగే ఏకైక మార్గం లోక్ అదాలత్ అని అన్నారు. తద్వారా కక్షిదారులకు సమయం, డబ్బు వృథా కావని, జీవితాల్లో మనశ్శాంతి దొరుకుతుందని అన్నారు.

విజయనగరం: రథంపై ఉన్న స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



జగన్నాథా.. జయం

- వైభవంగా మారు రథయాత్ర

విజయనగరం రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): మేళతాళాలు.. వేదమంత్రోచ్చారణలు.. జై జగన్నాథ నామస్మరణతో జగన్నాథుని మారు రథయాత్ర శనివారం వైభవంగా జరిగింది. తొలి రథయాత్ర నుంచి మారు రథయాత్ర వరకూ రోజుకో అవతారంలో దర్శనమిచ్చిన జగన్నాథ, బలభద్రులను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. గత నెల 27 నుంచి మారు రథయాత్ర జరగ్గా శనివారం వరకూ చాలా మంది భక్తులు ప్రతిరోజు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి అన్ని జగన్నాథ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో రథాలను ప్రత్యేకంగా అలంకరించారు. సాంప్రదాయబద్ధంగా పురోహితులు స్వాములను ఆలయం నుంచి బయటకు తీసుకువచ్చి రథంపై ఆశీనులు చేశారు. నగరంలోని పురాతన ఆలయాలైన దాసన్నపేట జగన్నాథ స్వామి ఆలయం, సంతపేట ఆలయం, మన్నార్ రాజగోపాల స్వామి ఆలయాల్లో స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. సంతపేట ఆలయ రథాన్ని కన్యకాపరేమశ్వరీ ఆలయం వరకూ తీసుకువచ్చారు. అదే విధంగా మన్నార్ రాజగోపాల స్వామి ఆలయ రథాన్ని మండపం జంక్షన్‌లో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీటితో పాటు చిక్కాల వీధిలో జగన్నాథుని రథయాత్ర వైభవంగా జరిగింది. సాముగారిడీలు, పులివేషాలు, ఇతర నేల వేషాలు సందడి చేశాయి.

భక్తుల బారులు



సుపరిపాలనతో సత్ఫలితాలు

- వైసీపీ విధ్వంసంతో రాష్ట్రం అస్తవ్యస్తం: మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



సుపరిపాలన గురించి వివరిస్తున్న మంత్రి సంధ్యారాణి

మెంటాడ, జూలై5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సుపరిపాలనతో ఎన్నో సత్ఫలితాలు అందుతున్నాయని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మెంటాడ మండల కేంద్రంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరావు ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి సంధ్యారాణి ఏడాది పాలనలో సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకుపోతోందన్నారు. జగన్ జమానాలో జరిగిన విధ్వంసం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన మాటకు ప్రభుత్వం కట్టుబడి ముందుకు వెళ్తోందన్నారు. ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ పథకం కింద రైతన్నలకు నిధులు విడుదల అవుతాయన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు అమలు కాబోతుందని, నిధులు కొరత ఉన్నప్పటికీ ఎంత మంది పిల్లలు చదువుకుంటే (మిగతా 8వ పేజీలో..)

నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో విచారణ

7 లో

7 లో

సాంకేతికతను వినియోగించుకోవాలి: ఎస్పీ

భజనలు చేస్తూ.. సంకీర్తనలు పాడుతూ

- సింహాచలం వరకూ రెండు వేల మంది పాదయాత్ర

7 లో

వ్యవసాయంతోనే జీడీపీ పెరుగుదల



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్


- బ్యాంకులు రైతుకు సహకరించాలి: కలెక్టర్ అంబేద్కర్

విజయనగరం కలెక్టరేట్, జూలై 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా మాత్రమే జీడీపీ పెరుగుదలకు అవకాశం ఉందని కలెక్టర్ అంబేద్కర్ అన్నారు. వ్యవసాయం వృద్ధి చెందాలంటే బ్యాంకులు రైతుకు సంపూర్ణంగా సహకారం అందించాలని కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీసీసీ, డీఎల్‌ఆర్‌సీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఏడాది కౌలు రైతులకు రూ.140 కోట్ల రుణం మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామని, ఈలక్ష్యాల సాధనకు కృషి చేయాలని (మిగతా 8వ పేజీలో..)

తొలి ఏకాదశి.. సకాల శుభాల రాశి!

- నేటి నుంచే విష్ణుమూర్తి యోగనిద్ర
- ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

8 లో



జి.సీతారాంపురంలోని కల్యాణవేంకటేశ్వరస్వామి

పెంపుడు జంతువులతో జాగ్రత్త



- పొంచి ఉన్న వ్యాధుల ముప్పు
- నేడు జూనోసిస్ డే

సాలూరు రూరల్/ విజయనగరం రింగురోడ్డు/ బొబ్బిలి/ రాజాం/ గజపతినగరం/ జియ్యమ్మవలస, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువులతో మనం ఏర్పరచుకున్న ఆత్మీయత ఎంతో ఉల్లాసాన్ని ఇస్తుంది. మనుషులు.. జంతువుల మధ్య బంధం అపురూపమైనదని చెప్పవచ్చు. అయితే పెంపుడు జంతువుల పట్ల సరైన జాగ్రత్తలు పాటించకపోతే, వాటి నుంచి మనుషులకు వివిధ రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ప్రేమ పెంచుకోవడం ఎంత అవసరమో.. తగిన జాగ్రత్తలు పాటించడం అంతే అవసరం. పెంపుడు జంతువులకు వ్యాక్సిన్లు వేయడం ద్వారా వాటి నుంచి మానవులకు వ్యాధులు రాకుండా నిరోధించవచ్చు. ఆదివారం ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా జంతువులు, వాటి నుంచి వచ్చే వ్యాధులు, జాగ్రత్తలను తెలుసుకుందాం.

250 వ్యాధులు

మనుషుల నుంచి పశువులకు... పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులనే జూనోటిక్ వ్యాధులు అంటారు. ఇలాంటి వాటిని ఇప్పటి వరకూ 250 వ్యాధులను ప్రపంచ వ్యాప్తంగా గుర్తించారు. ఇందులో 15 వరకూ ప్రాణాంతకమైనవని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా రేబిస్ వ్యాధి, బ్రూసెల్లోసిస్, బర్డ్‌ఫ్లూ, ఇన్‌ఫ్లూయంజా, ఆంత్రాక్స్ టీబీ, లెప్టో సిపారోసిస్ వంటివి ఉన్నాయి. ఇందులో రేబిస్ వ్యాధి అధిక శాతం కుక్కలకు వచ్చే ప్రాణాంతక వ్యాధి. దీనినే హైడ్రోఫోబియస్ అని పిలుస్తారు.

ప్రమాదకరం.. రేబిస్

రేబిస్... ప్రపంచాన్ని వణికిస్తున్న వ్యాధి. ఇది జంతువులకే కాదు. మనుషులకు వచ్చే భయంకరమైన వ్యాధి. ఈ వ్యాధి ముదిరితే మందు లేదు. 1885 జూలై 6న లూయి పాశ్చర్ అనే శాస్త్రవేత్త రేబిస్ టీకా ప్రయోగం విజయవంతమైంది. ఆ రోజున జూనోసిస్ (భారత్‌లో రేబిస్ డే) డేగా నిర్వహిస్తున్నారు. లిస్సా అనే క్రిమివల్లన రేబిస్ వ్యాప్తి చెందుతుంది. లిస్సా క్రిమి చేరిన కుక్కకాటు వల్ల రేబిస్ వ్యాధి మనుషులకు, ఇతర జంతువులకు సంక్రమిస్తుంది. ఈ వ్యాధికి గురైన వ్యక్తికి జ్వరం, తలనొప్పితో పాటు కోమాలోకి వెళ్లే ప్రమాదముంది. కుక్క లా చొంగ కారడం, కంటి నుంచి నీరు కారడం, నీటిని చూసి భయపడడం, కుక్కలా మొరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ వ్యాధితో మనుషులైనా.. జంతువులైనా మరణించే అవకాశాలు ఉన్నాయి.

- **జాగ్రత్తలు:** కుక్క కరిస్తే ఆ గాయాన్ని సబ్బుతో శుభ్రంగా కడగాలి. తక్షణం వైద్యుని సంప్రందించి తగిన వైద్యసేవలు పొందాలి. జంతువులకు కుక్కలు కరిచినా ఇదే పద్ధతిని పాటించాలి. పెంపుడు కుక్కలకు క్రమం తప్పకుండా ఏఆర్‌వీ వ్యాక్సిన్ వేయించాలి.
- **ఆంత్రాక్స్:** ఆంత్రాక్స్ క్రిమి ఉన్న పశుమాంసం తినడం, చర్మం తీయడం వల్ల ఈ వ్యాధి సోకుతుంది.మనుషుల్లో ఈ వ్యాధి వల్ల ముఖం, చేతులు, మెడ, కాళ్లపై కార్బాన్ క్యూబ్స్ వస్తాయి. జ్వరం, మెడ వాచిపోవడం, గొంతునొప్పి, దగ్గు, ఊపిరి పీల్చలేకపోవడం, నోటి నుంచి రక్తం కారడం తదితర లక్షణాలు కన్పిస్తాయి. ఆంత్రాక్స్ వ్యాధితో చనిపోయిన పశువుల జోలికి వెళ్లకపోవడం ఉత్తమం. ఈ వ్యాధితో మరణించే పశువులను పది అడుగుల లోతున గోతిలో సున్నం వేసి పాతిపెట్టాలి.



పెంపుడు కుక్కకు చికిత్స చేస్తున్న డాక్టర్ విష్ణు

పచ్చిపాలు, గుడ్డు తీసుకోకూడదు..



పచ్చిపాలు తాగకూడదు. పచ్చి గుడ్డు తినకూడదు. జూనోసిస్ వ్యాధుల్లో కీలకమైనవి రేబిస్, ఆంత్రాక్స్, టీబీ, మెదడువాపు వ్యాధి. జూనోసిస్ డే సందర్భంగా జూలై 6న ఉచితంగా ఏఆర్‌వీ వ్యాక్సిన్ కుక్కలకు వేస్తాం. జునోసిస్ వ్యాధులపై అవగాహన కల్పిస్తాం. జంతువుల నుంచి వచ్చే వ్యాధుల గురించి పెంపకందారులు తెలుసుకోవడం ఉత్తమం. అవగాహనతోనే జునోసిస్ వ్యాధుల నివారణ సాధ్యం.

-బీవీఎస్పీపీ గంగాధర్ రావు, ఏడీ, పశుసంవర్ధక శాఖ

జాగ్రత్తలు తప్పనిసరి..



పశువులు, కోళ్లు, ఇతర పెంపుడు జంతువులకు కాలానుగుణంగా వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా ఇవ్వాలి. ముఖ్యంగా పెంపుడు శునకాలు, పిల్లులకు యాంటీ రేబిస్ టీకాలు తప్పనిసరిగా వేయించాలి. రైతులు 4 నుంచి 8 నెలల వయస్సున్న దూడలకు బ్రూసెలా వ్యాధి నిరోధక టీకా వేయించాలి. పశువుల పాకలను అప్పుడప్పుడు క్రిమి సంహారక మందులతో శుభ్రం చేయాలి. పెంపుడు జంతువులను తాకిన తరువాత యాంటీ సెప్టిక్ లోషన్, సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. జిల్లాలో జూనోసిస్ దినోత్సవానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అన్ని ఆస్పత్రులకు యాంటీ రేబిస్ డోసులను తరలించాం. మూడు నెలల వయసు దాటిన కుక్కలు, పిల్లులకు టీకాలు వేయనున్నాం.

-డాక్టర్ వైవీ రమణ, జాయింట్ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ, విజయనగరం

యజమానులకు అవగాహన కల్పిస్తున్నాం..

జూనోసిస్ వ్యాధులపై పెంపుడు జంతువుల యజమానులకు అవగాహన కల్పిస్తున్నాం. బొబ్బిలి పట్టణ, పరిసర ప్రాంతాలలో సుమారు 250 పెంపుడు జంతువులు ఉన్నాయి. ఆదివారం స్థానిక పశువుల ఆసుపత్రి ప్రాంగణంలో పెంపుడు జంతువులకు ఉచితంగా టీకాలు వేస్తాం

-డాక్టర్ ఎల్.విష్ణు, ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్, బొబ్బిలి

రేబిస్‌తో ప్రమాదం..

జంతువులు, పక్షుల నుంచి సంక్రమించే వ్యాధులు చాలా ప్రమాదమైనవి. ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ప్రతి పెంపుడు జంతువుకు విధిగా యాంటీ రేబిస్ టీకాలు వేయాలి. విజయనగరంలోని బహుళార్ధ పశువైద్య శాలతో పాటు జిల్లాలోని అన్ని పశువుల ఆస్పత్రుల్లో ఆదివారం టీకాలు వేయనున్నాం.

-జి.మహాలక్ష్మీదేవి, ఉప సంచాలకురాలు, పశువైద్యశాఖ, విజయనగరం

జాగ్రత్తలు పాటించండి..

పెంపుడు కుక్కల యజమానులు జాగ్రత్తలు పాటించాలి. కుక్కలు ఉండే ప్రదేశాన్ని క్రిమి సంహారక ద్రావణంతో శుభ్రపరచాలి. కుక్కలను తాకిన తరువాత చేతులను క్రిమి సంహారక ద్రావణంతో కడగాలి. వ్యాధుల నివారణకు రెగ్యులర్ టీకాలు వేయించాలి. నట్టల నివారణ మందులు క్రమం తప్పకుండా వేయించాలి. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కుక్కలకు ఆదివారం ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ వేస్తాం.

-చంద్రశేఖర్, ఏడీ, పశువైద్య శాఖ, గజపతినగరం

ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు

- జిల్లా వ్యాప్తంగా సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం



గుర్ల: కెల్లలో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు



నెల్లిమర్ల: కొత్తపేటలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాగార్జున



శృంగవరపుకోట రూరల్: ఆర్.వేములాపల్లిలో బాలలతో ముచ్చటిస్తున్న టీడీపీ నాయకులు

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలుచేస్తోందని టీడీపీ నాయకులు తెలిపారు. శనివారం జిల్లాలోనిపలుచోట్ల తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కరపత్రాలు అందజేసి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం టీడీపీ నాయకులు మాట్లాడుతూ సూపర్‌సిక్స్ కార్యక్రమాల్లో భాగంగా సామాజిక పింఛన్లు పెంపుదల, తల్లికి వందనం కార్యక్రమాలను అమలుచేసినట్లు తెలిపారు. ఉచిత గ్యాస్ పంపిణీ చేపట్టామన్నారు.మహిళలకు ఉచిత బస్సు ఆగస్టు 15న ప్రారంభమవుతుందన్నారు. -(ఆంధ్రజ్యోతి బృందం)



విజయనగరం రూరల్: నగరపాలక సంస్థ పరిధిలో..



భోగాపురం: కరపత్రాలు పంపిణీ చేస్తున్న కర్రోతు బంగార్రాజు

రాజాంలో యువకుడి ఆత్మహత్య



శ్రీనివాస రావు(ఫైల్)

రాజాం రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాజాంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. వంగర మండలంలోని కొప్పరకు చెందిన బూరి శ్రీనివాసరావు (29) 15రోజుల కిందట రాజాంలోని బజాజ్ ఫైనాన్స్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా చేరాడు. పట్టణంలోని తెల గవీధిలో మరో మిత్రుడితో కలిసి ఓ రూంలో ఉంటున్నాడు. శనివారం ఉదయం శ్రీనివాసరావుకు తండ్రి నారాయణరావు ఫోన్‌చేశాడు. సెల్ స్విచ్ఛాఫ్‌రావడంతో శ్రీనివాసరావుతోపాటు రూములో ఉంటున్న రాజ్ కుమార్‌కు నారాయణరావు ఫోన్‌చేసి విషయాన్ని తెలియజేశాడు. దీంతో రాజ్‌కుమార్ రూముకు చేరుకునే సమయానికి గది లోపల గడియ పెట్టి ఉండడంతో కిటికీ లోపలి నుంచి పరిశీలించాడు. అప్పటికే శ్రీనివాసరావు ఫ్యాన్‌కు వేలాడుతూఉన్నట్లు గమనించాడు.రాజ్‌కుమార్ విషయాన్ని శ్రీని వాసరావు తండ్రి నారాయణరావుతోపాటు రాజాం పోలీసులకు సమాచా రం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ రవికిరణ్ పరిస రాలను గమనించి, శ్రీనివాసరావు జేబులో లభించిన లెటర్‌ను స్వాధీనం చేసుకున్నారు.శ్రీనివాసరావు మూడునెలలుగా కడుపునొప్పితో బాధపడు తున్నాడని, గ్రామంలో నాటువైద్యం చేయించుకుంటున్నాడని, నొప్పి తీవ్రం కావడంతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని నారాయణరావు రాజాం పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎస్ఐ రవికిరణ్ కేసు నమోదు చేశారు.

సంతకవిటిలోని వైన్ షాపులో చోరీ

సంతకవిటి, జూలై 5(ఆంధ్రజ్యోతి):సంతకవిటిలోని జిపి వైన్‌షాపులో చోరీ జరిగింది. నిందితులు ఆధారాలు దొరక్కుండా ఉండేందుకు సీసీ కెమెరాల హార్డ్‌డిస్కులు ఎత్తుకువెళ్లారు. పోలీసుల కథనం మేరకు.. శుక్రవారం అర్ధరాత్రి వైన్ షాపు వెనుక వైపు నుంచి గోడకు రంధ్రం చేసి, షాపులోకి ప్రవేశించి రూ. 24,260 వేల విలువచేసే మద్యం బాటిళ్లు, రూ. 14 వేలు నగదు చోరీచేశారు. దొంగతనం బయటపడకుండా ఉండేందుకు సీసీ కెమెరాలకు సంబంధించి హార్డ్‌డిస్క్‌ను ఎత్తికెళ్లారు. నిర్వాహకులు రాత్రి షాపు మూసే సమయంలో లెక్కలు చూసి తాళం వేసి వెళ్లిపోయారు. శనివారం ఉదయం యధావిధిగా షాపు తెరిచి చూసే సరికి, కౌంటర్ తెరిచిఉంది. కౌంటర్‌లోని డబ్బులు లేకపోవడంతో, షాపు మొత్తాన్ని పరిశీలించారు. వైన్ షాపు వెనుక వైపు నుంచి గోడకి రంధ్రం చేసి షాపులోకి ప్రవేశించారు. వైన్ షాపులో నౌకరి నామాగా పనిచేస్తున్న పేడాడ గోవిందరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ఎమ్. వాసుదేవరావు తెలిపారు.

రథయాత్రకు వెళ్తుండగా ఆటో బోల్తా

కురుపాం/ గుమ్మలక్ష్మీపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): జగన్నాథస్వామి రథయాత్రకు వెళ్తున్న ఆటో బోల్తాపడిన ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా, పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుమ్మలక్ష్మీపురం మండలం కొండుకుప్ప గ్రామం నుంచి పలువురు భక్తులు ఒడిశా రాష్ట్రం రాయగడలో జరగుతున్న రథయత్రకు శనివారం సాయంత్రం ఆటోలో బయలుదేరారు. ఒడిశా పిప్పలగూడ ఘటి వద్దకు వచ్చేసరికి ఆటో బోల్తా పడింది. దీంతో ఆటో ఉన్నవారికి గాయాలయ్యాయి. వీరిలో కొండుకుప్ప గ్రామానికి చెందిన పత్తిక సుమతి, స్నేహ, జయంతి, మూలుగూడ గ్రామానికి చెందిన పత్తిక శ్రీరామ్, జీలకర్ర శ్రావంతిలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనం ద్వారా కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కాపుసోంపురంలో వ్యాన్ బోల్తా

శృంగవరపుకోట రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాపుసోంపురం వద్ద అరకు-విశాఖ ప్రధాన రహదారిపై మేకల లోడుతో వెళ్తున్న వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. శనివారం ఉదయం ఎస్.కోట నుంచి అరకు మేకలలోడుతో వెళ్తున్న వ్యాన్ బోల్తాపడడంతో మేకలకు గాయాలు కాగా డ్రైవర్, అందులోఉన్నవారికి కూడా స్వల్పగాయాలయ్యాయి. దీంతో అరగంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో విచారణ

విజయనగరం రింగురోడ్డు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య సేవలపై రెండు రోజులుగా ఆంధ్రజ్యోతిలో ప్రచురితమవుతున్న కథనాల నేపథ్యంలో పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామని ఎన్టీఆర్ వైద్యసేవ కో-ఆర్డినేటర్ డాక్టరు సాయిరాం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో విచారణ చేశామని చెప్పారు. ఆసుపత్రుల యాజమాన్యాలు మందులు తీసుకోవాలని ఏ విధమైన ఒత్తిడి చేయలేదని పేర్కొన్నాయని తెలిపారు. ఆంధ్రజ్యోతిలో అందరి జాతకాలు బయటపెడతామన్న కథనం ప్రకారం నాలుగు రోజులుగా ఏ సమావేశం నిర్వహించలేదని, జూమ్ మీటింగు జరగలేదని పేర్కొన్నారు.

రేపు మిగులు సీట్లకు కౌన్సెలింగ్

నెల్లిమర్ల, జూలై 5(ఆంధ్రజ్యోతి): విజయనగరం, మన్యం జిల్లాలో గల ఐదు బాలురు, ఎనిమిది బాలికల పాఠశాలల్లో ఐదో తరగతి, ఇంటర్‌లో మిగులు సీట్ల భర్తీకి సోమవారం నెల్లిమర్ల గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త తెలిపారు. సీట్లు కావాల్సిన ఎస్సీ, ఎస్టీ బాలికలు సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు, బాలురు మధ్యాహ్నం ఒంటి గంటకు హాజరు కావాలని కోరారు. కౌన్సెలింగ్‌కు ఆధార్ జెరాక్స్, కుల ధ్రువీకరణ పత్రం, పదో తరగతి మార్కుల జాబితా తీసుకొని రావాలని కోరారు.

సెల్‌ఫోన్ రిపేరింగ్‌పై శిక్షణ

విజయనగరం దాసన్నపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో జన శిక్షణా సంస్థాన్ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇండియా ద్వారా సెల్‌ఫోన్ రిపేరింగుపై ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ వి.హరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు.ఎంఆర్ అటానమస్ కళాశాల సమీపంలోని ఏఎంఆర్ స్మార్ట్‌ఫోన్ సర్వీస్ సెంటర్‌లో రోజుకి మూడు గంటలు మాత్రమే శిక్షణ ఇసామని, ఎటువంటి ఫీజులు చెల్లించాల్సిన వసరం లేదని తెలిపారు.ఆసక్తిగల అభ్యర్థులు కంటోన్మెంట్ ఉడాకాలనీలోని జన శిక్షణ సంస్థాన్ కార్యాలయంలో శిక్షణ నిమిత్తం సంప్రదించాలని తెలిపారు. వివరాలకు 86397 85348, 95736 24866 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

మాటలతో ప్రజలను మభ్యపెట్టవద్దు: ఎమ్మెల్సీ

శృంగవరపుకోట రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మాటలతో ప్రజలను మభ్యపెట్టవద్దని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు కోరారు.ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాటలు ఈ ప్రాంత ప్రజలను మభ్యపెట్టేలా ఉన్నాయని తెలిపారు.శనివారం బొడ్డవరలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ పార్క్‌లు ఈప్రాంతంలో వస్తాయని, అందకే స్వాగతించాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ తదితరులు చెబుతున్నారన్నారు. రెండురోజుల కిందట జరిగిన జడ్పీ సమావేశంలో తాను ప్రశ్నించిన అంశంపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టిలో ఇక్కడ పరిశ్రమల ఏర్పాటు అంశం లేదని చెప్పడం విస్మయం కలిగించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న విజన్-2047 నివేదికలో కొత్తవలసలో పతంజలి పార్కు,ఇతర పరిశ్రమల ఏర్పాటు వంటివి ఉన్నాయని, ఇందులో ఎస్.కోట మండలంలోని జిందాల్ భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు గురించి ఎక్కడ లేదన్న విషయాన్ని వివరించారన్నారు.తనను కొందరు ప్రభుత్వ వ్యతిరేకిగా ముద్రవేస్తున్నారని, జిందాల్ పరిశ్రమ ఏర్పాటు కోసం తాను ఈప్రాంత వాసులను ఒప్పించి వందలఎకరాలు భూములు ఇప్పించానని పరిశ్రమ రాకపోయే సరికి తన ఇంటికి వచ్చి ప్రశ్నిస్తున్నారన్నారు.

పీ-4తో పేదలకు ప్రయోజనం

చీపురుపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనలకు అనుగుణంగా పీ-4 విధానం ద్వారా పేదలకు ప్రయోజనం చేకూర్చవచ్చని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీ-4 విజన్-2047 అంశంపై నాలుగు మండలాల అధికారులతో సమీక్షించారు.కార్యక్రమంలో చీపురుపల్లి ఎంపీడీవో ఇప్పలవలస సురేష్, తహసీల్దారు ధర్మరాజు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల వినతులు పరిష్కరించండి

భోగాపురం, జూలై5(ఆంధ్రజ్యోతి):గ్రామ, మండల స్థాయి ప్రజాప్రతినిధులిచ్చిన వినతులు అధికారులు పరిష్కరించాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి కోరారు.శనివారంభోగాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉప్పాడ అనూషా అధ్యక్షతన మండలసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముక్కాం ఎంపీటీసీ బాబాజీ, కవులవాడ, రామచంద్రపేట సర్పంచ్‌లు కొండపు ఎల్లయ్యమ్మ, దుక్కగౌరిలు గత కొన్ని సమావేశాలు నుంచి సమస్యలు చెబుతున్నా పరిష్కారం కావడంలేదని వాపోయారు.ఎంపీపీ ఉప్పాడ అనూషా మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించని అధికారులు ఎందుకని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు డి.సూర్యనారాయణ రాజు, పచ్చిపాలనాగలక్ష్మి, తహసీల్దార్ ఎం.రమణమ్మ, ఎంపీడీవో కిషోర్‌కుమార్, జిల్లా మత్స్యకార సంఘ అధ్యక్షులు బి.చిన్నప్పన్న పాల్గొన్నారు. కాగా ముంజేరు సమీప జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే లోకం నాగమాదవి ఉపాధి పథకంపై నియోజకవర్గంలోని అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఏపీడీ పద్మజ, ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎయిర్ పోర్టుకు విద్యుత్ లైన్ల ఏర్పాటుకు పరిశీలన

భోగాపురం, జూలై5(ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయానికి విద్యుత్ లైన్ల ఏర్పాటుకు సంబంధించి ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ డైరెక్టర్ సూర్యప్రకాశ్ శనివారం రావివలస, గూడెపువలస, కంచేరు ప్రాంతాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టుకు విద్యుత్ లైన్లు ఏవిధంగా వేయాలి, ఏటువైపు ఏర్పాటు చేయాలో సంబంధించి మ్యాప్ ద్వారా పరిశీలించారు. ఆయనతో పాటు విజయనగరం సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.లక్ష్మణరావు, రూరల్ ఎగ్జిక్యుటివ్ ఇంజినీర్ జి.సురేష్‌బాబు, సత్యనారాయణ, డిప్యూటీ ఇంజినీర్ మాదవనాయుడు, ఏఈ షేక్‌మస్తాన్ తదితరులు ఉన్నారు.

సాంకేతికతను వినియోగించుకోవాలి: ఎస్పీ

విజయనగరం క్రైం, జూలై 5(ఆంధ్రజ్యోతి):సాంకేతికతను వినియోగించుకుని ప్రతి అంశంపై పరిజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ కోరారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కె చౌదరి, ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.కాగాజిల్లా పోలీసుశాఖలో ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేసి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఎం.సత్తిబాబు సతీమణి రాజేశ్వరీకి లక్షా 47వేల 300 రూపాయల చెక్కును ఎస్పీ వకుల్ జిందాల్ అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, కార్యాలయ సూపరిటెండెంట్ రామకృష్ణ పాల్గొన్నారు.

నువ్వు రైతులను ఆదుకోవాలి

నెల్లిమర్ల, జూలై 5(ఆంధ్రజ్యోతి): నువ్వు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జరజాపుపేటలో వర్షాలతో తడిసిపోయిన నువ్వు పంటను రైతులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో రైతులు అవనాపు నాగేశ్వరరావు, కిల్లంపల్లి శ్రీను, సుద్దాపు గోవింద, మద్దిల ముత్యాలు, మద్దిల కృష్ణ పాల్గొన్నారు.

భజనలు చేస్తూ.. సంకీర్తనలు పాడుతూ

- సింహాచలం వరకూ రెండు వేల మంది పాదయాత్ర



పాదయాత్రగా సింహాచలం వెళ్తున్న భక్తులు

కొత్తవలస, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంగళపాలెంలో గల గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం ట్రస్టు కార్యాలయం నుంచి సింహాచలం వరకు పాదయాత్రను నిర్వహించారు. పూరిలో జరుగుతున్న స్వామి వారి జగన్నాథ రథయాత్రను పురస్కరించుకుని ఈ యాత్రను ప్రతిఏటా నిర్వహిస్తుంటారు. ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు ఆధ్వర్యంలో ఒడిశా, అరకు, విజయనగరం, విశాఖ జిల్లాలకు చెందిన 60 గ్రామాల నుంచి సుమారు రెండు వేల మంది భజనలు చేస్తూ.. సంకీర్తనలు పాడుతూ పాదయాత్రగా సింహాచలంలోని వరహాలక్ష్మి నృసింహస్వామివారిని దర్శించుకున్నారు.గిరిపుత్రులతోపాటు తరిగొండ వెంగమాంబ భజనబృందం సభ్యులు భజనలు చేసుకొని పాదయాత్ర చేశారు.

భూముల కబ్జాపై లోకాయుక్తకు ఫిర్యాదు

జామి,జూలై 5 (ఆంధ్రజ్యోతి): జామిలో ప్రభుత్వభూములు కబ్జాపై లోకాయుక్తకు ఫిర్యాదుచేసినట్లు తాండ్రంగికి చెందిన హ్యూమన్ రైట్స్ ప్రతినిధి కొత్తలి గౌరినాయుడు తెలిపారు. డీపట్టా భూముల్లో ప్రైవేటు స్కూళ్లు నిర్మాణంపై ఆధారాలతో అందించామని, దర్యాప్తుచేయిస్తామని అధికారులు తెలిపారన్నారు.

డీజీపీ, ఎస్పీకి దరఖాస్తు

శృంగవరపుకోట రూరల్,జూలై 5 (ఆంధ్రజ్యోతి): నిరసనకు పోలీసులు అనుమతి ఇవ్వాలని కోరినా పట్టించుకోకపోవడంతో డీజీపీ, ఎస్పీకి వాట్సప్ ఈ గవర్నెన్స్‌లో, రిజిస్టర్ పోస్టులో దరఖాస్తు చేసినట్లు జిందాల్ నిర్వాసిత మహిళలు తెలిపారు. శనివారం ఎస్.కోట పోలీస్‌స్టేషన్ వద్ద మట్లాడుతూ 18 ఏళ్ల కిందట భూములిచ్చామని ఇప్పటికి న్యాయం జరగలేదని, దీంతో తాము శాంతియుతమైన పోరాటం చేస్తున్నామని తెలిపారు.

లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం

రాజాం రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): లోక్‌అదాలత్ ద్వారా సత్వరన్యాయం లభిస్తుందని మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షురాలు, సీనియర్ న్యాయాధికారి కె.శారదాంబ తెలిపారు.రాజాంలో జూనియర్ న్యాయాధికారి నైమిషతో కలిసి న్యాయ విజ్ఞానసదస్సు నిర్వహించారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 136 కేసులు పరిష్కరించినట్లు కె.శారదాంబ ఒక ప్రకటనలో తెలియజేశారు.

- గజపతినగరం, జూలై5 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో చేసిన తప్పులను రాజీ ద్వారా పరిష్కరించుకోవాలని న్యాయాధికారి ఎ. విజయ్‌రాజ్‌కుమార్ కోరారు. స్థానిక కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 348 కేసులు పరిష్కరించారు.
- శృంగవరపుకోట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట కోర్టులో న్యాయాధికారి బి.కనకలక్ష్మి అధ్యక్షతన జరిగిన లోక్‌అదాలత్‌లో 47 కేసులు పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జి.అప్పలనాయుడు, న్యాయవాదులు బి.సత్యనారాయణ. ఎం.అప్పారావు, జి.సూరిదేముడు, రామారావు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే కూటమి లక్ష్యం


బొబ్బిలిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే కూటమి లక్ష్యమని ఎమ్మెల్యే బేబీ నాయన అన్నారు. తెలుగుదేశం పార్టీ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన పట్టణంలోని 29వ వార్డులో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో చేసే సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు అల్లాడ భాస్కరరావు, గెంబలి శ్రీనివాసరావు, సుంకరి సాయిరమేష్, చింతాడ రవి, ఎక్కుడు వాసు, మహ్మద్‌బాషా తదితరులు పాల్గొన్నారు. ● బొబ్బిలి రూరల్: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బేబీనాయన శనివారం సీతయ్యపేట గ్రామంలో పర్యటించి, సంక్షేమ పథకాలపై ప్రచారం చేశారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నిరసన

బొబ్బిలి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15.485 కోట్ల భారాన్ని వినియోగదారులపై మోపారని సీపీఐ నాయకులు ఆరోపించారు. విద్యుత్ సమస్యలు, ఒప్పందానికి వ్యతిరేకంగా శనివారం స్థానిక జెండామహల్ జంక్షన్‌లో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు తగ్గిస్తామన్న మాటను నిలబెట్టుకోలేకపోయారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న, కొలుసు వెంకటసత్యనారాయణ, గొల్లపల్లి తౌడు పాల్గొన్నారు.

● నెల్లిమర్ల, జూలై 5(ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు డిమాండ్ చేశారు. శనివారం నెల్లిమర్ల సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం సబ్‌స్టేషన్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకుడు పోలిపల్లి సూరి పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

రాజాం రూరల్, జులై 5 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో పాటు పారిశుధ్య కార్మికులకు కనీస వేతనంగా రూ.10 వేలు ఇవ్వాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకుడు రామ్మూర్తి నాయుడు డిమాండ్ చేశారు. శనివారం రాజాం ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రమదోపిడీ చేస్తున్నాయని, ఉద్యోగభద్రత కల్పించడం లేదని ఆరోపించారు.

క్రీడాకారుడికి ఎమ్మెల్యే అభినందన

బొబ్బిలి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని అగురు వీధికి చెందిన బొండపల్లి రమేష్ అనే యువకుడు జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో క్లాసిక్ ఫిజిక్‌లో నాలుగో స్థానం, మెన్స్ ఫిజిక్‌లో ఐదో స్థానాన్ని దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఆ యువకుడిని ఎమ్మెల్యే బేబీనాయన శనివారం బొబ్బిలిలోని తన నివాసంలో అభినందించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలరు వెలగాడ హైమావతి, వాణిజ్యవిభాగం జిల్లా అధ్యక్షుడు సుంకరి సాయిరమేష్ పాల్గొన్నారు.

మాస్టర్‌ప్లాన్ ముసాయిదా ప్రదర్శన

బొబ్బిలి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (బుడా) ఆధ్వర్యంలో రూపొందించిన పట్టణ ముసాయిదా మాస్టర్ ప్లాన్‌ను మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ప్రకటించారు. ఈ పరిధిలో నివసించేవారు గానీ, ఆస్తులు కలిగి ఉన్న వారు ఏవైనా అభ్యంతరాలు, సూచనలు ఉంటే నెల రోజుల్లోగా తమకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఆమె అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మాస్టర్‌ప్లాన్ నమూనాను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ కోరెడ్ల కిరణ్‌కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో
మిగులు సీట్ల భర్తీకి రేపు కౌన్సెలింగ్

బాడంగి, జూలై 5(ఆంధ్రజ్యోతి): బాడంగిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగులు సీట్లు కోసం నెల్లిమర్లలోని గురుకుల పాఠశాలలో ఈనెల 7వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంటకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జి.వరప్రసాద్ తెలిపారు. ఆమె శనివారం మాట్లాడుతూ ఐదో తరగతిలో ఎస్సీ-30, బీసీ సి-10 సీట్లు, అలాగే ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ ఎస్సీ 2, బీసీ సీ-2, ఎస్టీ-1, బైపీసీలో ఎస్సీ 16, బీసీ సీ-5, ఎస్టీ-3 సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తా చాటిన భవాని


పతకాలతో రెడ్డి భవాని

విజయనగరం రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకరకాం గ్రామానికి చెందిన రెడ్డి భవానీ ఆసియన్ చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తాచాటింది. ఈ మేరకు వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో మూడు బంగారు పతకాలు సాధించింది. కోచ్ గాదిపల్లి ఆనంద్ పర్యవేక్షణలో సత్తాచాటడంతో క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

సీతంపేటను పంచాయతీగా గుర్తించాలి


పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

శృంగవరపుకోట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పంచాయతీ శివారులోని సీతంపేటను ప్రత్యేక పంచాయతీగా గుర్తించాలని ఆ గ్రామానికి చెందిన పెద్దలు, ప్రజలు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామ సభలో సర్పంచ్ గనివాడ సంతోషికుమారి, కార్యనిర్వాహక అధికారి వీవీ అనురాధలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ అర్హతకుగల జనాభా గ్రామంలో ఉందని, మేజర్ పంచాయతీలో కలిసి ఉండడంతో అభివృద్ధి కనిపించడం లేదని సన్యాసప్పుడు, చిప్పాడ రమణ, చింతల మూర్తి, ఈశ్వరరావు తదితరులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోపాడ కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై అవగాహన

కొత్తవలస, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చీపురువలసలో ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్(ఐఈసీ) ఆధ్వర్యంలోఉపాధిహామీ పనులకు సంబంధించిన సామాజిక తనిఖీలో భాగంగా శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఉపాధి హామీ పథకం కింద ఎన్ని పనులు చేశారన్న విషయమై అవగాహన ర్యాలీ చేశారు. అనంతరం గ్రామ సభను ఏర్పాటు చేసి ఈ పథకాన్ని చిన్న, సన్నకారు రైతులు ఎలా వినియోగించుకోవాలో వివరించారు. ఏపీఎం జనార్దనరావు, ఈఓ శైలజ, ఈఓ పీఆర్డీ శ్రీదేవి, సర్పంచ్ మచ్చరామస్వామి పాల్గొన్నారు.

పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

రేగిడి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలు బడిబయట ఉండడానికి వీల్లేదని, ఎట్టిపరిస్థితుల్లో పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో వరప్రసాదరావు తెలిపారు. శనివారం మండలంలోని వండానిపేట ప్రాథమిక పాఠశాలను తనిఖీచేశారు. ఆయన వెంట లింగాలవలస స్కూల్ కాంప్లక్ చైర్మన్ దాసరి కృష్ణారావు ఉన్నారు.

జై జగన్నాథ

● ఘనంగా మారు రథ యాత్ర
● గుడించా మందిరాల్లో ప్రత్యేక పూజలు
● అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు


పార్వతీపురంటౌన్: రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

జగన్నాథస్వామి మారు రథయాత్ర ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. గుడించా మందిరంలోగల స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వైభవంగా రథయాత్ర నిర్వహించారు. ఈ రథయాత్రలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు.
(ఆంధ్రజ్యోతి బృందం)


పాలకొండ: జగన్నాథస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


కురుపాం రూరల్: మొండెంఖల్‌లో పూజలు


జియ్యమ్మవలస: చినమేరంగిలో..


గజపతినగరంలో..


వీరఘట్టంలో రథయాత్ర

షట్టర్లు బిగిస్తారా?

(ఐదో పేజీ తరువాయి)

సంగతి అటుంచితే కనీసం మరమ్మతులు చేయలేదు. షట్లర్లు ఊడిపోయినా బిగించే నాథుడు కరువైపోయాడు. ఆఖరుకు అన్ని షట్టర్లూ ఊడిపోయి దయనీయంగా కనిపిస్తోంది. నీరు నిల్వ ఉండే పరిస్థితి లేదు. ప్రాజెక్టు దీన స్థితిని చూస్తున్న ఆయకట్టు రైతులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. కొత్త షట్టర్లు వచ్చినా నిర్లక్ష్యంగా పడి ఉండడం గమనార్హం. నాగావళి నదిపై సంతకవిటి మండలంలో ఉన్న నారాయణపురం ఆనకట్ట దుస్థితిది.

విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలోని 11 మండలాల్లో 50 వేల ఎకరాలకు సాగునీరందించే నారాయణపురం ప్రాజెక్టు కొన్ని సంవత్సరాలుగా ఎలాంటి మరమ్మతులకు నోచుకోలేదు. సంతకవిటి మండలం రంగారాయపురం సరిహద్దులో శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం నారాయణపురం గ్రామం వద్ద నాగావళి నదిపై 1959-63 మధ్య నారాయణపురం ఆనకట్టను నిర్మించారు. సంతకవిటితో పాటు శ్రీకాకుళం జిల్లాలో 50 వేల ఎకరాలకు ఈ ఆనకట్ట సాగునీరు అందిస్తూ వచ్చింది. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు వైపు చూడలేదు. దీంతో ఆనకట్ట పూర్తిగా దెబ్బతింది. షట్టర్లు, రెగ్యులేటర్లు, స్పిల్‌వే, కాలువలు, గట్లు ఇలా అన్నీ బలహీనమయ్యాయి. 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.112.10 కోట్ల జైకా నిధులు వచ్చాయి. కొంత మేర పనులు జరిగాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పనులు అంటూ హడావుడి చేశారే తప్ప పూర్తిచేయలేదు. పైగా 35 శాతం పనులు చేశామని చెప్పి రూ.14 కోట్ల ఖర్చును గణాంకాల్లో చూపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రాథమికంగా షట్టర్ల నిర్మాణంపై దృష్టిపెట్టింది. శిథిలమైన షట్టర్ల తయారీకి రూ.1.23 కోట్లు విడుదల చేసింది. అయితే జూలై రెండో వారం సమీపిస్తున్న ఆ షట్టర్లను బిగించ లేదు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో నదిలో నీటి ప్రవాహం పెరిగితే షట్టర్ల బిగింపు అనేది కష్టతరంగా మారనుంది. వీలైనంత త్వరగా షట్టర్లు ఏర్పాటు చేసి సాగునీటిని అందిస్తామని అధికారులు చెబుతున్నారు.

త్వరలో పనులు..

త్వరలో షట్టర్లు బిగిస్తాం. అందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నాం. షట్టర్లు బిగించిన తరువాతే సాగునీటిని విడుదల చేస్తాం. ఖరీఫ్‌లో సాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. శివారు ఆయకట్టు వరకూ సాగునీరు అందిస్తాం.

-రవీంద్రనాయుడు, డీఈఈ, నారాయణపురం ఆనకట్ట

శివారు ఆయకట్టుకు నీరందేనా?

(ఐదో పేజీ తరువాయి)

ఆశాజనకంగా లేదు. జలాశయం వద్ద విద్యుత్ దీపాలు లేవు. ప్రాజెక్టు ఇంత దయనీయంగా ఉన్నా కూడా గత ప్రభుత్వం పట్టించుకోలేదు పైగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని, 37 వేల ఎకరాలకు నీరు అందిస్తామని అప్పటి ముఖ్యమంత్రి హోదాలో జగన్ పాదయాత్రలో హామీలిచ్చారు. ఒక్కటీ ఆచరించలేదు. మరోవైపు మడ్డువలస రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల ద్వారా ఈ నెల 7న ఖరీఫ్ పంటలకు నీరు విడుదల చేయటానికి అధికారులు సన్నాహాలు చేశారు. ఈ ఏడాది ఆయకట్టు మొత్తం 30077 ఎకరాలకు నీరు అందిస్తామని అంటున్నారు. ఇలాంటి ప్రకటనలు ఎన్నో విన్నామని రైతులు విమర్శిస్తున్నారు.

మడ్డువలస రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల ద్వారా వంగర మండలంలో 996, రేగిడిలో 6777, సంతకవిటిలో 10976, జి.సిగడాంలో 6029, పొందూరు వద్ద 99వ స్టేజ్-1 ద్వారా 24877 ఎకరాలకు.. స్టేజ్-2 ద్వారా లావేరులో 5200 కలుపుకుని మొత్తం 30077 ఎకరాలకు నీరు అందించాల్సి ఉంది. సగం ఆయకట్టుకు కూడా పూర్తిస్థాయిలో నీరు అందడం లేదని రైతులంటున్నారు. ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం 65 మీటర్లు కాగా 64 మీటర్ల స్థిరీకరణ ఉంది. అయితే నిర్వాసితుల సమస్యల కారణంగా పూర్తిస్థాయిలో నీరు నిల్వ చేయటంలేదని అధికారులు చెబుతున్నారు. కుడి ప్రధాన కాలువ ద్వారా 700 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తే తప్పా శివారు భూములకు నీరు అందదు. కాలువలు సహకరించడం లేదని అధికారులే చెబుతున్నారు. స్పిల్ వేపై 11 గేట్లు ఉండగా కొన్ని దెబ్బతిన్నాయి. వాటికి సరిగా మరమ్మతులు చేయక నిత్యం నీరు వృథాగా నాగావళికి పోతోంది. రెండో దశ కాలువల పనులు ఏళ్లుగా సాగుతూ ఉన్నాయి.

పర్యవేక్షణ కరువు..

ప్రస్తుతం జలాశయానికి ఉన్న 11 గేట్లలో 1,2,3,5,6,10,11 గేట్లుకు ఉన్న రబ్బరు సీల్లు దెబ్బతిన్నాయి. దీంతో నీరు వృథాగా పోతోంది. వీటి పరిస్థితిపై గతంలో 'ఆంధ్రజ్యోతి'లో పలుమార్లు కథనాలు వచ్చాయి. స్పందించిన ప్రభుత్వం రూ.1.80 కోట్లు మంజూరు చేసింది. ఆ సమయంలో రిజర్వాయర్‌లో నీరు మొత్తం ఖాళీ చేసి నామమాత్రంగా పనులు జరిపి విలువైన మత్స్య సంపదను దళారులకు కట్టబెట్టారు. సిబ్బంది ఏడుగురు విధుల్లో ఉండాలి. కేవలం ఒక్కరే ఉంటున్నారు. లష్కర్ల కొరతా ఉంది. కొన్నేళ్లుగా కొత్త వారిని నియమించడం లేదు. జలాశయం వద్ద విద్యుత్ దీపాలు వేయడం లేదు.

నిధులొస్తే పనులు చేపడతాం

కొన్నేళ్ల కిందట రెండవ దశ పనులు నిలిచిపోయాయి. అత్యవసర నిధుల మంజూరుతో కొన్ని పనులు చేపట్టాం. ఇటీవల గేట్లు, విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేశాం. నిధులు పూర్తిస్థాయిలో వస్తే పనులు చేపట్టి పూర్తి ఆయకట్టుకు నీరు అందిస్తాం. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 590 క్యూసెక్కులు వస్తుండగా 64 మీటర్లకు చేరింది. ఈ నెల 7న నీటి విడుదలకు సన్నాహాలు చేశాం.

- నితిన్, ఏఈ, మడ్డువలస

వ్యవసాయంతోనే
జీడీపీ పెరుగుదల

(ఐదో పేజీ తరువాయి)

ఆదేశించారు. ప్రతి ఒక్కరూ పీఎంజెజెబివై, పిఎంఎస్‌బివై పథకాల కింద బీమా పొందేలా చూడాలని సూచించారు. పత్తి పంటకు వాతావరణ ఆధారిత బీమా... వరి, మొక్కజొన్న, నువ్వ పంటలకు సాధారణ బీమా సదుపాయం ఉందన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం నారాయణమూర్తి, డిఆర్‌డిఏ పీడీ కళ్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. ● జిల్లాలోని 23 సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో రూ.4కోట్ల 67 లక్షలతో చేపట్టిన వివిధ పనులను నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆర్‌అండ్‌బి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. వసతిగృహాల మరమ్మతుల్లో భాగంగా వారం రోజుల్లో అన్ని హాస్టళ్లల్లో కిటికీలు, తలుపులు బాగు చేయించి, దోమలు రాకుండా మెస్‌లు ఏర్పాటు చేయాలన్నారు. సోమవారం నుంచి వసతిగృహాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాల న్నారు. ● ఈనెల 10న మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు కలెక్టర్ అంబేడ్కర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఏడాది కేవలం ప్రభుత్వ పాఠశాలలోనే నిర్వహించారని, ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల్లోనూ నిర్వహించాలన్నారు. పిల్లలే తల్లిదండ్రులకు ఆహ్వానాలు అందిస్తారని పేర్కొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

విజయనగరం రింగురోడ్డు, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగు ఉద్యోగులను ఆప్కాస్‌లో చేర్చి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.రవికాంత్ డిమాండ్ చేశారు. శనివారం విజయనగరం డిపో వద్ద ఏపీపీటీడీ ఎంప్లాయిస్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకురెండో రోజు ధర్నా నిర్వహించారు. ప్రతినిధులు ఎస్ స్వామి, శ్రీనివాసరావు, రమణ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల నిరీక్షణ

(ఐదో పేజీ తరువాయి)

ఆలోచనలో ప్రభుత్వం వుంది. రీసర్వే ప్రక్రియలో వీరి అవసరం ఉన్నట్లు శుక్రవారం జరిగిన రెవెన్యూ శాఖ సమీక్షలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సీఎం నారాచంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లిన సమయంలో సానుకూలంగా స్పందించినట్లు వచ్చిన వార్తలతో వీరంతా అనందం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామ, వార్డు సచివాలయాలను కూటమి ప్రభుత్వం హేతుబద్ధీకరణ చేయనుంది. ఈమేరకే బదిలీల పక్రియ జరిగింది. ఏఏ పోస్టులు, ఏఏ గ్రామ వార్డు సచివాలయాల్లో వున్నాయో ప్రభుత్వం ముందుగానే సూచించింది. దీంతో వైద్య ఆరోగ్య శాఖకు చెందిన హెల్త్ సెక్రటరీ (గ్రేడ్ -3 ఎఎన్ఎం)లకు తప్ప మిగిలిన శాఖలకు చెందిన ఉద్యోగాలన్నీ సగానికి సగం తగ్గాయి. దీంతో ఈ శాఖలకు చెందిన బదిలీల కౌన్సెలింగ్‌లో పోస్టులు వున్న సచివాలయాలకు మాత్రమే బదిలీ చేయాలి. అప్షన్‌లు ఇచ్చిన ఉద్యోగులంతా తాము కోరుకున్న సచివాలయానికి బదిలీ జరుగుతుందో లేదోనని మథన పడుతున్నారు. కాగా ఏఎస్ఎంకు హేతుబద్ధీకరణ లేదు. అన్ని సచివాలయల్లోను వీరి పోస్టులను ఉంచారు. మహిళ పోలీస్‌ల బదిలీలను స్వయంగా ఎస్పీ వకుల్ జిందాల్ పర్యవేక్షించారు. ప్రస్తుతానికి అన్ని సచివాలయాలకు సర్దుబాటు చేశారు. వీరికి బదిలీల స్థానాలను సూచించారు. మిగిలిన శాఖల ఉద్యోగులకు బదిలీ స్థానాలు తెలియక టెన్షన్‌తో ఉన్నారు. బదిలీ ఉత్తర్వుల కోసం ఎదురుచూస్తున్నారు.

సుపరిపాలనతో సత్ఫలితాలు

(ఐదో పేజీ తరువాయి)

అందరికీ తల్లికి వందనం అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకున్నామన్నారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి చిరువ్యాపారులతో మమేకమై కూరగాయలు కొన్నారు. పకోడి వేశారు. రజక, కిరాణా వ్యాపారుల వద్దకు వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చలుమూరి వెంకటరావు, జి.చలం, జి.అన్నవరం, రవిశంకర్, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

గంట్యాడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు, రైతులకు మెరుగైన సేవలందించాలని డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున చెప్పారు. శనివారం గంట్యాడలోని డీసీసీబీ బ్రాంచ్‌లో సిబ్బందితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వాణిజ్య బ్యాంకులకు దీటుగా డీసీసీబీ, దాని అనుబంధ శాఖలను తీర్చిదిద్దనున్నట్టు చెప్పారు.

●విజయనగరం రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి):స్థానిక డీసీసీబీ కార్యాలయంలో జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకుని సహకార జెండాను చైర్మన్ నాగార్జున అవిష్కరించారు. కార్యక్రమంలో డీజీఎంలు, సహకార శాఖాధికారులు, డీసీసీబీ ఉద్యోగులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్‌లు రద్దు

గజపతినగరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పురుగమందుల దుకాణాల్లో నిబధనలు పాటించి రైతులకు మేలైన విత్తనాలను, ఎరువులను అందజేయాలని ఏవో కిరణ్‌కుమర్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. శనివారం గజపతినగరంలో శ్రీసత్యసాయి ట్రేడర్స్, శివశక్తి ఎగ్రో కెమికల్స్ పురుగుల మందు షాపులను తనిఖీచేశారు.

తొలి ఏకాదశి.. సకాల శుభాల రాశి!

● నేటి నుంచే విష్ణుమూర్తి యోగనిద్ర
● ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు


వైభవ వేంకటేశ్వరస్వామి

రాజాం రూరల్/బొబ్బిలి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తెలుగునాట ఏ పని ప్రారంభించాలన్నా మంచి తిథులను చూస్తారు. పాఢ్యమి మొదలు చతుర్దశి వరకు ఉన్న తిథుల్లో దశమి, ఏకాదశిలకు మిగతా వాటికన్నా అత్యంత ప్రాధాన్యం ఇస్తాం. అటువంటి ఏకాదశిలు నెలకు రెండు చొప్పున సంవత్సరానికి 24 వస్తుంటాయి. ఆషాఢ మాసం శుక్లపక్షంలో వచ్చే ఏకాదశికి (ఆదివారం) మాత్రం ప్రత్యేకత ఉంది. ప్రస్తుతం చైత్రశుద్ధ పాఢ్యమిని సంవత్సర ఆరంభంగా.. తెలుగు సంవత్సరాది (ఉగాది)గా జరుపుకుంటున్నాం. కానీ.. గతంలో ఆషాఢ శుక్ల ఏకాదశిని సంవత్సర ఆరంభంగా పరిగణించేవారు. ఏడాదిలో వచ్చే 24 ఏకాదశిల్లో ఇది మొదటిగా ఉండేది. అందుకే దీనిని తొలి ఏకాదశి అంటారు.

పూజలకు సన్నాహాలు

బొబ్బిలి పట్టణంలో చరిత్రాత్మకమైన శ్రీరుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం పూజలు వైభవంగా నిర్వహిస్తారు. కంచరవీధి శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి, సింగారపువీధిలోని వైభవవేంకటేశ్వర, పాతబొబ్బిలిలోని వేంకటేశ్వర, గొర్లె సీతారాంపురంలో గల శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఆదివారం తొలిఏకాదశి ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు.

న్యూస్ బాక్స్

ఫసల్ బీమాను వినియోగించుకోండి

బొబ్బిలి రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతులు వినియోగించుకోవాలని బొబ్బిలి ఏడీఏ మజ్జి శ్యామ్‌సుందర్ అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. వరి, మొక్కజొన్న, నువ్వులు, పత్తి వంటి పంటలకు రైతులు తక్కువ ప్రీమియంతో ఈ బీమాను పొందవచ్చన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

బొబ్బిలి రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం స్థానిక ఎంఈవో చల్ల లక్ష్మణరావుకు సమ్మె నోటీసు అందజేశారు. ఆయన వెంట ఎండీఎం కార్మికులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీఎం సంఘం అధ్యక్షురాలు డి.రామలక్ష్మి, సభ్యులు లంక లక్ష్మి, నారాయణమ్మ పాల్గొన్నారు.

ప్రపంచ బ్యాంకు మెప్పు కోసమా?

బొబ్బిలి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఈనెల 10న జరిగే మెగా పేరెంట్స్ మీటింగ్స్ కోసం విట్‌నెస్(సాక్ష్యం) అధికారిని నియమించడం చాలా విడ్డూరంగా ఉందని యూటీఎఫ్ నేత కె.విజయగౌరి ఎద్దేవా చేశారు. శనివారం సాయంత్రం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ప్రపంచ బ్యాంకు మెప్పు కోసం ప్రభుత్వం పరితపిస్తున్నట్లుగా తాజాగా విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వులు ఉన్నాయన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు బదిలీలు, కోత, కుదింపులు వంటి ప్రక్రియతో చాలా అస్తవ్యస్తంగా తయారయ్యాయి.

హామీల అమలులో విఫలం

రామభద్రపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర విమర్శించారు. శనివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు గాలికి వదిలేశారని ఆరోపించారు. వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రామభద్రపురం ఏవోగా శివ

రామభద్రపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ అధికారిగా అమరా శివ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన బొబ్బిలి వ్యవసాయ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఏవో వి.వెంకటయ్య పదవీ విరమణ చేశారు.

సత్ప్రవర్తనతో మెలగండి

బొబ్బిలి/రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నేరచరిత్ర కలిగినవారు ఇప్పటి నుంచైనా సత్ప్రవర్తనతో మెలగాలని డిఎస్పీ భవ్యరెడ్డి సూచించారు. బొబ్బిలి పోలీస్ స్టేషన్ పరిధి, బొబ్బిలి రూరల్ సర్కిల్‌కు చెందిన రామభద్రపురం, బాడంగి, తెర్లాం పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న నేర ప్రవృత్తి, నేర చరిత్ర కలిగిన వారిని ఆమె శనివారం పిలిపించి హెచ్చరికలు చేశారు. సత్ప్రవర్తనతో ఉండాలని హెచ్చరించారు. బొబ్బిలి స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె.సతీష్‌కుమార్, బొబ్బిలి రూరల్ సీఐ నారాయణ, ఇతర ఎస్ఐలు హాజరయ్యారు.

జనసేనను బలోపేతం చేయాలి

శృంగవరపుకోట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వబ్బిన సత్యనారాయణ కోరారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు తాండ్రంగి చంటి, మోపాడ కృష్ణ బాబు, దొగ్గరమణ, గంధవరపు సతీష్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు మంజూరు

భోగాపురం, జూలై5 (ఆంధ్రజ్యోతి): భోగాపురంలో ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి జనసేన నాయకులు శనివారం స్థలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా నాయకులు పల్లంట్ల జగదీష్, పల్లరాంబాబు మాట్లాడుతూ గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాలు మంజూరయ్యిందని తెలిపారు.